


రక్షణ కల్పించాలని ఎంఎల్‌ఎకు గిరిజనుల వినతి

ప్రజాశక్తి - టి.నర్సాపురం


వినతి అందిస్తున్న నేతలు, గిరిజనులు

స్థానిక భూస్వాముల నుండి రక్షణ కల్పించాలని కోరుతూ మండలంలోని కృష్ణాపురం మెట్ట (అల్లూరి సీతారామరాజు కాలనీ) గిరిజనులు సిపిఎం ఆధ్వర్యంలో గురువారం పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఆదివాసీ గిరిజనులు సాగు చేసుకుంటున్న భూమిని స్థానిక బడా గిరిజనేతరుడు గత ప్రభుత్వం అండదండలతో స్థానిక నాయకులతో కలిసి గిరిజనులపై దౌర్జన్యంగా బెదిరిస్తూ ఆ భూముల కోసం భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. తమకు రక్షణ కల్పించి సాగు చేస్తున్న భూమిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెల్లం దుర్గారావు, మడకం కుమారి, వగ్గాల లక్ష్మి, బరగడ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వర్ష భీభత్సం


వేలేరుపాడు రోడ్డులో వాగులో కొట్టుకుపోయిన కారులో నుంచి బయటపడి స్థానికుల సాయంతో ఒడ్డుకు చేరుకున్న కుటుంబం, డ్రైవర్

- పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు
- వేలేరుపాడు మండలంలో కొట్టుకుపోయిన కారు
- అతికష్టంపై కారులోని ఐదుగురిని రక్షించిన స్థానికులు
- బుట్టాయగూడెం సమీపంలో వరదలో చికుక్కున్న స్కూల్‌బస్సు
- అప్రమత్తమైన అధికారులు: సిబ్బంది సెలవులు రద్దు

జిల్లాలో గురువారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షం భీభత్సం సృష్టించింది. జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతోపాటు ఏజెన్సీలో పలు వాగులు ఉప్పొంగడంతో పలు గ్రామాల నడుమ రాకపోకలు స్తంభించాయి. వేలేరుపాడు వెళ్తున్న కారు వాగులో కొట్టుకుపోయింది. స్థానికులు స్పందించి కారులో చిక్కుకున్న ఐదుగురికి ప్రాణాలకు తెగించి రక్షించారు. బుట్టాయగూడెం మండలంలో గుబ్బలమంగమ్మ గుడి వద్ద చిక్కుకున్న యాత్రికులు సుమారు 150 మందిని అతికష్టంపై కామవరం తీసుకొచ్చి అక్కడ నుంచి దొరమామిడి తరలించారు.

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలవ్యాప్తంగా రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. చెరువులు, వాగులు వంకల్లోకి వరద నీరొచ్చి చేరడంతో పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల నారుమడులు ముంపునకు గురయ్యాయి. కామయ్యపాలెం వాగు, అశ్వారావుపేట వాగు, సంగం వాగుల గుండా వరద ప్రవాహం పోటెత్తడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

బుట్టాయగూడెం రూరల్: మండలంలోని రవ్వారిగూడెం తదితర గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా వరిచేలు, నాట్లు, నారుమడులు ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

చింతలపూడి: వాతావరణం అనుకూలించే వరకు నాలుగు మండలాల్లోని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. గత రాత్రి నుండి కురుస్తున్న వర్షానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులను అప్రమత్తం చేశారు. అత్యవసరమైతే 24 గంటల్లో ఏ సమయంలోనైనా సంప్రదించాలని సూచించారు.

టి.నరసాపురం: మండలంలో గత రాత్రి నుండి కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లు స్తంభించడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రధానంగా మండలంలోని మక్కినవారిగూడెం సమీపంలో దుర్గ గుడి వద్ద జలవాగు, గంగినీడుపాలెం, బండివారిగూడెం మధ్యలో ముగ్గురాళ్ల వాగు, పాకాలగూడెం వద్ద కూడా నీటిప్రవాహం వంతెనపై నుండి పొంగి ప్రవహిస్తోంది. మధ్యాహ్నపువారిగూడెం-అప్పలరాజుగూడెం గ్రామాల మధ్య ఎర్రకాలువ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు వాగుల వెంట ఎవరూ ప్రయాణం చేయొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

టి.నర్సాపురంలోని ఎర్రచెరువు జలమయమైంది. ఇళ్లలోకి వర్షపునీరు చేరి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుండి వర్షం జోరున కురుస్తుండటంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు నానావస్థలు పడ్డారు.

జంగారెడ్డిగూడెం టౌన్: లక్కవరం ఎస్‌సి కాలనీలో భారీవర్షానికి రోడ్లు నీట మునిగాయి. భారీ వర్షానికి లక్కవరంలో ఇంటి గోడ నాని కూలిపోయింది. ఇంట్లోనే కుటుంబం ఉన్నా ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బుట్టాయగూడెం: రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతమైన బుట్టాయగూడెం మండలంలోని కొండవాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. కన్నాపురం, కోటరామచంద్రాపురం, పద్మవారిగూడెం, ఇప్పలపాడు, రెడ్డిగణపవరం, పట్టెన్నపాలెం వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా కాజ్‌వేల వద్ద పోలీసు పహారా కాస్తూ రాకపోకలను నియంత్రిస్తున్నారు. బుట్టాయగూడెం నుంచి రెడ్డిగణపవరం వెళ్లే మార్గంలో కాజ్‌వే పై నుంచి వెళ్తున్న జంగారెడ్డిగూడెం ఢిల్లీ పబ్లిక్ వరద ప్రవాహంలో నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానిక యువకులు ఆ బస్సును బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేసినా ఫలించలేదు. సమాచారం అందుకున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లు, విఆర్‌ఒలు తెల్లం పోతురాజు, శ్రీరామ్మూర్తి, మున్ని అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆ క్రమంలో అటువైపుగా వెళ్తున్న లారీ సాయంతో స్కూల్ బస్సును బయటకు లాగడంతో విద్యార్థులు, ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గుబ్బల మంగమ్మ గుడి వద్ద కొండ వాగు ప్రమాదకరస్థాయిలో ప్రవహించడంతో గురువారం ఉదయమే గుడికి వెళ్లిన సుమారు 150 మందికిపైగా అక్కడ చిక్కుకుపోయారు. వారిని గురువారం రాత్రికి రెవెన్యూ అధికారులు, స్థానికులు అతికష్టంపై కామవరం తీసుకొచ్చి అక్కడ నుంచి దొరమామిడి తరలించి వసతి కల్పించారు.

పోలవరం: మండలంలో రెండు రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గురువారం ఉదయం నుండి మండలంలో భారీ వర్షం కురిసింది. గుంజవరం, పేద్రాల కాలువలు పొంగుతున్నాయి. కొండవాగుల జలాలు పొంగి గుంజవరం కల్వర్టుపై నుండి ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. మెత్తప్పకోట, సున్నాలగండి వాగుల జలాలు వింజరం గోవిందరాజుల చెరువులోకి ప్రవహిస్తున్నాయి. ఇటుకలకోట ఇసుక కాలువ జలాలు కడమ్మ కాలువ ద్వారా ప్రవహించి కడమ్మ స్లూయిస్ నుండి గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. కొవ్వాడ కాలువ జలాలు పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిస్ నుండి గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. మండలంలో గూటాల, పోలవరం, పట్టిసీమ, కొత్తపట్టిసీమ గ్రామాల్లో ఏటిగట్టుకి దిగువన ఉన్న నివాసాల వద్ద డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక నివాసాల్లో వర్షపు నీరు చేరింది.

కుక్కునూరు రూరల్: మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లిపోతున్నాయి. దాచారం సమీపంలోని గుండేటి వాగు పొంగడంతో దాచారం, బెస్తగూడెం, గొమ్ముగూడెం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ముదినేపల్లి: మండలంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన జోరు వానకు జనజీవనం స్తంభించింది. పలు కాలనీల్లోకి వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కార్మికులు, వ్యవసాయ కూలీలకు పనులు లేకపోవడంతో ఇళ్లకే పరిమితమయ్యారు. వ్యాపారాలు లేక దుకాణాలన్నీ వెలవెలబోయాయి.

కొయ్యలగూడెం: భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. పంట పొలాలన్నీ జలమయమయ్యాయి.

చింతలపూడి: భారీ వర్షానికి మండలం పూర్తిగా జలమయమైంది. పొలాలు నీట మునిగి చెరువులను తలపించాయి. రెండు రోజుల్లో ముంపు తగ్గకపోతే నాట్లు, నారు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో చెరువులన్నీ నిండిపోయాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డిఎస్‌పి

చింతలపూడి: మండలంలోని నాగిరెడ్డిగూడెంలో ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు వస్తున్న నేపథ్యంలో ఏక్షణమైనా దిగువకు నీరు విడుదల చేసే అవకాశం ఉందని, కావున తమ్మిలేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్రన్ కోరారు. జంగారెడ్డిగూడెం మండలంలోనికరాటం కృష్ణమూర్తి జలాశయం నుంచి దిగువకు నీరు వదులుతున్నారని, ఎర్రకాల్వ పరివాహక ప్రజలూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలోని బైనేరు కాలువ, పట్టిన్నపాలెం వాగు, మార్కండేయపురం వాగు, కామవరపుకోట మండలంలోని కళ్లచెరువు వాగు, చింతలపూడి మండలంలోని కివ్వాపురం వాగు, లింగపాలెం మండలంలోని ఆసన్నగూడెం కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున వాటిని దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు.


టి.నర్సాపురం: మక్కినవారిగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జలవాగు

వాగులో కొట్టుకుపోయిన కారు

కుక్కునూరు రూరల్: రాజమండ్రి నుంచి వేలేరుపాడు కారులో వెళ్తున్న కుటుంబం కోయమ్మధార వద్ద వాగులో చిక్కుకుని అతికష్టంపై ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. వాగు ప్రవాహంపై అంచనా లేని కారు డ్రైవర్ కాజ్‌వేపై నుంచి వెళ్లే ప్రయత్నంలో వరద ఉధృతికి ఒక్కసారిగా కారు కొట్టుకుపోయింది. చివరిక్షణంలో అప్రమత్తమైన కారులోని డ్రైవర్‌తోపాటు ఇద్దరు మహిళలు, ఇద్దరు బాలురు అతికష్టంపై కారులోంచి బయటపడ్డారు. అయినప్పటికీ వరద ఉధృతికి కొట్టుకుపోతూ వాగు మధ్యలో ఉన్న పొదల్లో చిక్కుకున్నారు. వారి కేకలు విన్న స్థానిక గ్రామస్తులు వెంటనే స్పందించి తాళ్ల సాయంతో ప్రాణాలకు తెగించి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. ఈలోపు అధికారులు అప్రమత్తమై హెలికాప్టర్ సాయం కావాలని జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈలోపుగానే గ్రామస్తులు మరో ప్రయత్నం చేసి తాళ్ల సాయంతో ఎట్టకేలకు ఐదుగురిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. ఆ కుటుంబాన్ని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పరామర్శించి గ్రామస్తులను అభినందించారు. కారులో ఉన్నవారిని డ్రైవర్ రామారావు, జ్యోతి, గడ్డం కుందనకుమార్, సాయి జ్యోతి, గడ్డం జగదీశ్ కుమార్‌గా గుర్తించారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

స్పిల్‌వే నుంచి 2 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులైన శబరి, మంజీర, ప్రవర, పర్ణ, ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని, మానేరు ఉప్పొంగి గోదావరిలో కలుస్తున్నాయి. దీంతో వరద జలాలను స్పిల్‌వే నుంచి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు లక్షల క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఇఇ మల్లికార్జునరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 28.080 మీటర్లు, స్పిల్‌వే దిగువన 18.230 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్‌కి ఎగువన 28.230 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 17.570 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తమ్మిలేరు వరద వల్ల ఏలూరులో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు
కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో భారీ వర్షాలు, వరదల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గురువారం స్థానిక శనివారపుపేట, తమ్మిలేరు కాలువ లోబ్రిడ్జి వద్ద ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా భారీ వర్షాల హెచ్చరికలను దృష్టిలో పెంచుకుని ఉంచుకుని సంబంధిత అధికారులు అప్రమత్తమై ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గతంలో తమ్మిలేరు వరదలను దృష్టిలో పెట్టుకుని చర్యలు చేపట్టాలని తెలిపారు. తమ్మిలేరు రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులు తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ్మిలేరు కాలువకు సంబంధించి ఏలూరులో మూడు పాయింట్ల వద్ద సంబంధిత అధికారులు 24 గంటలు పర్యవేక్షణలో ఉండాలని ఆదేశించారు. తమ్మిలేరు వరద ఉధృతి ప్రాంతాలైన ఇందిరమ్మ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, సాయినగర్‌లోని కాల్వల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తమ్మిలేరు కాలువ రిటర్నింగ్ వాల్, లోబ్రిడ్జిపై ట్రాఫిక్ నియంత్రణ, బండ్ ఏరియా తదితర అంశాలను గురించి ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఏలూరు ఆర్‌డిఒ భాజాబలీ, ఇరిగేషన్ ఇఇ దేవప్రకాష్, డిఇ అర్జున్, కార్పొరేషన్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిఎస్‌పి శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ గాయత్రి ఉన్నారు.


ఏలూరులో తమ్మిలేరును పరిశీలిస్తున్న కలెక్టర్

వరదలపై కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నెంబర్ 18002331077

అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు

జిల్లాలో వరద పరిస్థితిపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో గురువారం జిల్లాలో వరద పరిస్థితిపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఈ దృష్ట్యా ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో ప్రజల సౌకర్యార్థం టోల్‌ఫ్రీ నెంబర్ 18002331077తో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ప్రధానంగా వరద ముంపు ఉండే గోదావరి పరీవాహక మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరంల్లో ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు ముంపు మండలాల ప్రజలకు పంపిణీ నిమిత్తం అవసరమైన నిత్యావసర సరుకులను ఆయా మండల కేంద్రాలకు తరలించాలన్నారు. వరద అత్యవసర విధులు కేటాయించిన సిబ్బంది ఎట్టిపరిస్థితుల్లోనూ వారి గ్రామాల్లోనే ఉండాలన్నారు. గజఈతగాళ్లు, లైఫ్ జాకెట్స్, లైఫ్‌బోట్లను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ శర్మిష్ఠ, జిల్లా వ్యవసాయశాఖాధికారి భాషా, ఉద్యాన అధికారి రామ్మోహన్, డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ట్రాన్స్‌కో ఎస్‌ఇ సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

తమ్మిలేరు రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద గల తమ్మిలేరు రిజర్వాయర్‌లోకి గురువారం ఉదయం నుంచి భారీస్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 255 క్యూసెక్కులుగా ఉన్నట్లు ఎఇ పరమానందం తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం 355 అడుగులని, ప్రస్తుతం తమ్మిలేరు బేసిన్ 335.64 అడుగులుగా, గొనెల వాగు బేసిన్ 335.18 అడుగులుగాను ఉందని చెప్పారు.

కరాటం జలాశయానికి పోటెత్తిన వరద

జంగారెడ్డిగూడెం టౌన్: మండలంలోని కొంగువారిగూడెంలో ఉన్న జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో రెండు గేట్లు ద్వారా దిగువకు నీరు వదులుతున్నారు. ఇరిగేషన్ డిఇ దేవప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుతం కొంగువారిగూడెంలోని కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం వరద నీటితో నిండుతోందని, రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 81.01 మీటర్లకు చేరిందని తెలిపారు. ప్రాజెక్టులోకి ప్రస్తుతం ఇన్‌ఫ్లో 3,200 క్యూసెక్కులుగా ఉందని, రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నామని వివరించారు.

కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఎసిల ఏర్పాటు

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఎసిలు అందిస్తున్న నేతలు, అధికారులు

కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ బడుల్లోనూ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల విరాళాలతో ఎసి తరగతి గదులు ప్రారంభించడం అభినందనీయమని ఉంగుటూరు ఎంఇఒ-2 కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నాచుగుంట శివారు కొత్తగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు విరాళాలు సేకరించగా వచ్చిన రూ.80 వేలతో రెండు తరగతి గదుల్లో ఎసిలను బిగించారు. వాటిని గురువారం ఎంఇఒ, ప్రజాప్రతినిధులు, టిడిపి నేతల సమక్షంలో ప్రారంభించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని అధికారులు అభినందించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ విద్యాసంస్థలు అభివృద్ధి చెందుతున్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కర్రి వెంకటలక్ష్మి, ఝాన్సీరాణి, పేరెంట్స్ కమిటీ సభ్యుడు గుదే శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యురాలు గంటా ఉషారాణి, టిడిపి నాయకుడు ఇమ్మణ్ణి గంగాధరరావు, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతాంగ హామీలు అమలు చేయాలి

కిసాన్ మోర్చా నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్ర మోడీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) నాయకులు కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు వినతి పత్రాన్ని వాట్సాప్ ద్వారా పంపించారు. అనంతరం ఏలూరు ఆర్‌ఆర్ పేటలోని స్ఫూర్తి భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం నిర్వహించారు. రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం(స్ఫూర్తి భవన్) రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం(అన్నే భవన్) జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు పిబివి.సుబ్రహ్మణ్యం, కెఎస్ఎన్ మూర్తి, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.కృష్ణ చైతన్య మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీల అమలు కోసం చర్యలు చేపట్టాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందుకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని కోరారు. అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం తీసుకువచ్చి దేశవ్యాప్తంగా ఒక దఫా రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూ నిర్వాసిత రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి పేద రైతుకు, వ్యవసాయ కార్మికుడికి నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు, రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగుమందులపై జిఎస్‌టి రద్దు చేయాలన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమకారులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తి వేయాలని, అమరవీరుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమ అమరవీరుల జ్ఞాపకార్థం ఒక స్మారక నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు రైతు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు.


అభివాదం చేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలి

ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్‌ఎ సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి నగరపంచాయతీలో జూనియర్ కళాశాల విద్యార్థుల లేడీస్ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాత్రిపూట కరెంటు పోయినప్పుడు ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. దీంతో వెంటనే ఇన్వెర్టర్లు ఇస్తానని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఉదయం పూట ఫ్రూట్స్ పెట్టడానికి నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామని వార్డెన్ ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురాగా, విద్యార్థులందరికీ ఫ్రూట్స్ పెట్టమని, ప్రతినెలా రూ.6 వేలు తాను సొంతంగా ఇస్తానని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని వార్డెన్‌కి తెలియజేశారు. డ్రెయినేజీ వాటర్ హాస్టల్‌లోకి వస్తుందని విద్యార్థులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురాగా వెంటనే నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్‌ని పిలిపించి, డ్రెయినేజీ తీయించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా శాశ్వత భవన నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలు చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు సమస్యలు చెప్పడంతోనూ, వాటిని అక్కడికక్కడే, ఎంఎల్‌ఎ సొంత ఖర్చులతో పరిష్కరిస్తాననడంతోనూ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థులతో ఎంఎల్‌ఎ రోషన్ కుమార్

కళామతల్లి ముద్దుబిడ్డ ఎస్‌వి రంగారావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తన విలక్షణ నటనతో తెలుగు చలన చిత్ర సీమలో కళామతల్లి ముద్దబిడ్డగా ఎస్‌వి రంగారావు అంచెలంచెలుగా ఎదిగిన తీరు వర్ధమాన నటులందరికీ ఆదర్శమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ప్రతినాయకునిగా రాణిస్తూనే, పాజిటివ్ పాత్రల్లో సైతం పరకాయప్రవేశం చేసి తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించిన దిట్ట ఎస్‌విఆర్ అని కొనియాడారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయంలో విశ్వనట చక్రవర్తి ఎస్‌వి రంగారావు 50వ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంఎల్‌ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొని, ఎస్‌విఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నటనతో పాత్రలకు జీవం తీసుకువచ్చిన మహానటులు ఎస్‌విఆర్ అని కొనియాడారు. అసామాన్య నటనతో ప్రేక్షకులను మెప్పించిన ఆయనకు అనేక అవార్డులు దక్కాయన్నారు. పాత్ర ఎటువంటిదైనా ఆ పాత్రకు న్యాయం చేసేలా నటించడం ఎస్‌విఆర్‌లోని గొప్ప నటనకు నిదర్శనమన్నారు. అటువంటి గొప్ప నటుడికి మేనల్లుడినైనందుకు తాను గర్వపడుతున్నానని ఎంఎల్‌ఎ చంటి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఆర్ మనవడు బాబాజీ, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, ఎమ్ఆర్‌డి బలరాం, పూజారి నిరంజన్, బెల్లపుకొండ కిషోర్, ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు, దాకారపు రాజేశ్వరరావు, వీరమాచినేని చందు, కోలపల్లి ఉమాశంకర్, మారం అను, లంకపల్లి మాణిక్యాలరావు, పలువురు ఎస్‌విఆర్ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

వర్ధంతి కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బడేటి చంటి


ఎస్‌విఆర్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ, టిడిపి నేతలు

డిజిపిని కలిసిన రెడ్‌క్రాస్ ఛైర్మన్

ఏలూరు అర్బన్: రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్.ద్వారక తిరుమల రావును జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో డిజిపి కోస్టల్ ఐజీగా ఎంతో సమర్థవంతంగా పనిచేశారని, ఆ సమయంలో తాను జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నానని, ద్వారక తిరుమలరావుతో కలిసి పలు లీగల్ సెమినార్లు, పోలీస్ కాన్ఫరెన్స్‌లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని నిర్వహించామని అన్నారు. అప్పటి సహకారం ఇప్పుడు కూడా అందించి లీగల్ సెమినార్లు, పోలీస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించడంతోపాటు, పోలీస్ శాఖ ద్వారా రాష్ట్రంలో రెడ్ క్రాస్ శాఖలకు పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడానికి సహకారం అందించమని కోరగా డిజిపి సహకరిస్తానని తెలిపారని కృష్ణారెడ్డి అన్నారు.


డిజిపితో కృష్ణారెడ్డి

ప్రజాశక్తి
www.prajasakti.com

నీట మునిగిన వృద్ధాశ్రమం


వృద్ధాశ్రమంలోకి చేరిన నీరు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని సీతారామ లక్ష్మీ స్వచ్ఛంద సేవా సంస్థ పూర్తిగా నీట మునిగింది. ఆశ్రమంలోనికి వరద నీరు మొత్తం వచ్చి చేరడంతో వృద్ధులు, వికలాంగులు, అనాథలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులు, వికలాంగులు, అనాథలను, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు అర్బన్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 25వ తేదీ వరకు పెంచడమైనదని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు తెలియజేశారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరదలుచుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు కళాశాల, కోర్స్ ఎంపికను ఈనెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఆన్‌లైన్ చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత సహాయ కేంద్రమును సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏలూరులో బిఎ హిస్టరీ, బికాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్‌సి జువాలజీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ కోర్సులు కలవని తెలియజేశారు.

విజయసాయిరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణి బాబు

నూజివీడు టౌన్ : రాజ్యసభ ఎంపీ విజయసాయి రెడ్డి మహా న్యూస్, ఎబిఎన్, టివి 5 ఛానళ్ల యాజమాన్యంపై వ్యక్తిగతంగా మాట్లాడటం, జర్నలిస్టులను ఏకవచనంతో, గౌరవం లేకుండా పిలవడంపై జనసేన నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణి బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజానికి జర్నలిస్టులు మూల స్తంభం అని, ఛానల్స్ ద్వారా ప్రజల్లోకి ప్రతి విషయాన్ని, అన్యాయాలను తీసుకువెళ్లడంలో న్యూస్ ఛానల్స్ ఎంతగానో కృషి చేస్తాయని తెలిపారు. అలాంటి మీడియా ప్రతినిధులపై రాజ్యసభ ఎంపీ విజయసాయి రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇంకా వైసిపి ప్రభుత్వమే అధికారంలో ఉందనే భ్రమలో విజయసాయి రెడ్డి ఉన్నారన్నారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖండించాలి తప్ప, మీడియా ప్రతినిధులపై, మహా న్యూస్ ఛైర్మన్ వంశీకృష్ణపై, టివి 5 సాంబశివరావుపై వ్యక్తిగతంగా వారి కుటుంబంపై కూడా దూషణలు చేస్తూ మీడియా రంగాన్ని కించపరచడం నీచమైన చర్యని పేర్కొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

ద్వారకా తిరుమల: రైతులకు దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు కోరారు. రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు రైతాంగ సమస్యలు పరిష్కారం కోరుతూ ఎం.నాగులపల్లి సచివాలయం వద్ద వ్యవసాయ అసిస్టెంట్‌కు రైతు సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు మాట్లాడుతూ రైతులకు సంబంధించి పంటల బీమా పథకం అమలు చేయాలన్నారు. పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పశువుల కొనుగోలుకు లోన్లు ఇవ్వాలన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీలేని పంట రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు జోయపాటి సత్యనారాయణ, నాయకులు తూంపాటి మురళీ పాల్గొన్నారు.

నీటి ప్రవాహానికి అడ్డంకిగా గుర్రపు డెక్క

ముదినేపల్లి: సిబి కెనాల్ ద్వారా మంచినీటి చెరువులకు సరఫరా అవుతున్న నీటి ప్రవాహానికి కాలువలో గుర్రపు డెక్క పెరుగుదల అడ్డంకిగా మారింది. ఐదు రోజుల క్రితం సిబి కెనాల్‌కు తాగునీటిని విడుదల చేశారు. అయితే ఎగువ నుంచి వచ్చే నీటితో పాటుగా గుర్రపు డెక్క కూడా భారీగా నీటి ప్రవాహంలో కొట్టుకొస్తుంది. ఇలా కొట్టుకొచ్చిన గుర్రపుడెక్క కాలువపై పలుచోట్ల నిర్మించిన కాలిబాట వంతెన వద్ద దట్టంగా పేరుకుపోయింది. వంతెన కింద దట్టంగా పట్టివేయడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉంది. కొరగుంటపాలెం, గోకినంపాడు వంతెనల కింద గుర్రపు డెక్క దట్టంగా పట్టివేయడంతో నీరు దిగువకు సరఫరా అయ్యేందుకు అవరోధంగా మారింది. దీంతో కాలువ శివారు గ్రామాల మంచినీటి చెరువులకు తాగునీరు అందే పరిస్థితి లేకుండా పోతుంది. అధికారులు వెంటనే స్పందించి వంతెన వద్ద కొనకు పట్టిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించి, కాలువలో నీటి సరఫరా సాఫీగా జరిగే విధంగా చూడాలని, శివారు గ్రామాలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థుల ప్రతిభకు అభినందన

ఆగిరిపల్లి : మండల పరిధిలోని ఈదర జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు 2023-24 విద్యా సంవత్సరంలో గానూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణులు కావటమే కాకుండా గురువారం నిర్వహించిన ఎంసెట్-24 ఇంజనీరింగ్ మొదటి విడత కౌన్సిలింగ్‌లో సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్.శారద తెలిపారు. ఆరుగురు విద్యార్థినులకు గానూ, ఐదుగురు విద్యార్థినులు మూడి జస్మిత, దొండపాటి లక్ష్మి, పిల్లి లక్ష్మి, చింతగుంట తేజస్విని, సిహెచ్.దీపికలు ఇంజనీరింగ్‌లో సిఎస్ఇ బ్రాంచి నందు ఎన్ఆర్ఐ, లక్కిరెడ్డి బాలిరెడ్డి కళాశాలల్లో ఉచిత సీట్లు సాధించిన వీరిని గ్రామ సర్పంచి దొండపాటి అనిత, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కె.అంజయ్య, ప్రధానోపాధ్యాయులు ఎస్.శారద విద్యార్థినులను అభినందించారు.

తెలంగాణ సిఎంను కలిసిన డాక్టర్ శ్రీనివాస్

ముదినేపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం టిడిపి యువనేత, ముదినేపల్లికి చెందిన డాక్టర్ ఉద్దగుంట శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన సందర్భంగా రేవంత్ రెడ్డిని కలిసి అభినందించారు. హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో ఆయనను కలిసినట్లు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

22న మామిడి రైతుల సదస్సు

నూజివీడు టౌన్: ఈనెల 22వ తేదీన సోమవారం ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తెలుసుకొనేందుకు ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొంటారన్నారు. రైతు సోదరులు, వ్యాపారులు, ఎగుమతి దారులు పాల్గొని మామిడి సాగులో, మార్కెటింగ్‌లో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తులో తగిన కార్యక్రమం తీసుకునేందుకు సహకరించవలసినదిగా కోరుతున్నారు.

పట్టిసీమ నుంచి 1.770 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 1.770 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం అసిస్టెంట్ ఇంజినీర్ వినోద్ గురువారం తెలిపారు. పట్టిసీమ గోదావరి నీటిమట్టం 16.08 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 5 పంపుల ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెలలో ఇప్పటి వరకు 6.93 టిఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కామవరపుకోట : మండలంలో పెండింగ్‌లో ఉన్న పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టిడిపి అధ్యక్షులు కిలారు సత్యనారాయణ చింతలపూడి ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. చింతలపూడిలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో మండలంలోని పలువురు టిడిపి నాయకులతో కలిసి ఆయన కలిశారు. ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని, కొన్ని కొన్ని ప్రాంతాల్లో పత్రికా ప్రకటన విడుదల చేశారు. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్న నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందని తెలియజేశారు.

కామవరపుకోట: వర్షం కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తడికలపూడి ఎస్ఐ జయబాబు సూచించారు. మండలంలోని ఎగువ ప్రాంతాల నుంచి లోతట్టు ప్రాంతాలకు వరద నీరు వస్తుందని కాబట్టి రైతులు, కూలీలు పొలాలలోకి వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

స్పందించని అధికారులు


ఫుట్‌పాత్ మీద నిర్వహిస్తున్న షాపులు

ప్రజాశక్తి - ముసునూరు

మండలకేంద్రమైన ముసునూరులో ఫుట్‌పాత్‌లను కొందరు ఆక్రమించుకోవడంతో పాటు ఆ స్థలాల వద్ద వేలల్లో వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇలా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలో అధికారుల నిర్లక్ష్యం వల్లనే సామ్యానులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫుట్‌పాత్ అద్దెకు ఇచ్చి వ్యాపారం చేస్తున్న వారు కొందరైతే, అదే ఫుట్‌పాత్‌లను తమ వ్యాపార అవసరాలకు వినియోగించుకుంటూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నవారు కొందరు. ఇలా ఫుట్‌పాత్‌ల వ్యాపారం చేసే ప్రదేశంలో ట్రాఫిక్‌జామ్ అవడం, ప్రమాదాలకు గురికావడం చాలా మాములుగా మారింది. ప్రభుత్వాధికారులు ఎవరూ స్పందించకపోవడంతో, ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతూ శాశ్వతంగా నిర్మాణాలు చేపట్టారు. మండల, పంచాయతీ అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించకపోగా ఉన్న సౌక్యరాలు కూడా నిర్వీర్యం చేసేలా కొందరు ప్రయత్నిస్తున్నప్పటికీ వారిపై చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానులను రేకెత్తిస్తున్నాయి. ప్రభుత్వాధికారులు లంచాల రూపంలో, గిఫ్ట్‌ల రూపంలో, కొంతమంది బడాబాబులు మాముళ్ల చెల్లింపునకు కక్కుర్తి పడి అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అలాగే ఫుడ్ కార్పొరేషన్ శాఖాధికారులు మండలంలోని 16 గ్రామాల్లో ఈ మధ్యకాలంలో ఎక్కడా తినుబండరాలపై పరిక్షలు నిర్వహించి, చర్యలు చేపట్టినట్లు దాఖలాలు కనిపించడం లేదు. కావున ఇప్పటికైనా సంబధిత అధికారులు స్పందించి, ప్రజలకు, వినియోగదారులకు మేలు చేకూర్చాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

పలుచోట్ల అవగాహనా ర్యాలీ


ఏలూరు అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ఏలూరు అర్బన్: ద్విచక్రవాహనదారులే కాకుండా వెనకాల కూర్చుని ప్రయాణిస్తున్న తోటి వాహనదారులు కూడా హెల్మెట్ ధరించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి సెక్రెటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి సెక్రెటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి హెల్మెట్ దారణ-ప్రమాదాల నివారణ అంశంపై ఏలూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచిన్న ప్రమాదాల వల్ల తలకు గాయమైనప్పుడు పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, కావున తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రయాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వాలంటీర్లు, ఎస్‌విఆర్‌కె డిగ్రీ కాలేజ్ విద్యార్థులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ దారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ మాట్లాడుతూ ముందుగా హెల్మెట్ ఉపయోగాలను గురించి ప్రజలకు తెలియజేయడం, వాళ్లతో హెల్మెట్ ధరించేలా చైతన్యపరచడం జరుగుతుందని అన్నారు. ఆగస్టు ఒకటవ తేదీ నుంచి హెల్మెట్ ధరించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడుతాయని, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాన్ని నడిపితే సదరు వాహన దారుడికి డ్రైవింగ్ లైసెన్సును మూడు నెలల పాటు రద్దు చేయబడుతుందని, వెయ్యి రూపాయల వరకూ జరిమానా విధించబడుతుందని అన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, పోలీస్ వారు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని మండల లీగల్ సర్వీస్ అథారిటీ గౌరవ మెజిస్ట్రేట్ కిషోర్ కుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో గురువారం జంగారెడ్డిగూడెం సిఐ పి.రాజేష్, ఎస్ఐ జ్యోతిబాసు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యాన విద్యార్థులతో ర్యాలీని నిర్వహించి వేగం వద్దు-ప్రాణం ముద్దు అని నినదించారు. అనంతరం ఈ ర్యాలీని ఉద్దేశించి కిషోర్ కుమార్ మాట్లాడుతూ హెల్మెట్ ఉపయోగాలను ప్రజలకు తెలియజేసి, హెల్మెట్ ధరించేలా చైతన్య పరచడం చేయడం జరుగుతుందన్నారు.

కిషోర బాలికలు భవిష్యత్తును తీర్చుదిద్దుకోవాలి

ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రసన్న

ముదినేపల్లి: కిషోర బాలికలు తమ భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని ఐసిడిఎస్ సింగరాయపాలెం సెక్టార్ సూపర్వైజర్ ప్రసన్న అన్నారు. మండలంలోని సింగరాయపాలెం సెక్టార్ పరిధిలోని బొమ్మినంపాడు అంగన్వాడీ ఒకటో కేంద్రంలో భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలు జాగూరుకతతో ఉండాలని, ఏ పరిస్థితినైనా ఎదుర్కొనే విధంగా మానసికంగా, శారీరకంగా దఢంగా ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దారం సుధా, ఉపాధ్యాయులు అరుంధతి పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి'

మండవల్లి: దాతల సహాయాన్ని అందిపుచ్చుకుని విద్యలో రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని భైరవపట్నం గ్రామ ప్రముఖులు చాపరాల దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లింగాల సర్పంచి బోయిడి ధనలక్ష్మీ రాధిక సురేష్ బాబు ఆర్థిక సహాయంతో విద్యార్థులకు అందించిన బస్సు పాసుల పంపిణీ కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు పలు రకాలుగా సాయం అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయగా దాతలు నోట్ పుస్తకాలను, పెన్నులను, ఇతర సామగ్రిని అందించారని, ఇప్పుడు పాఠశాలకు వచ్చి తిరిగి సురక్షితంగా ఇంటికి వెళ్లే విధంగా విద్యార్థులు ఇబ్బందులు తలెత్తకుండా పాసులను పంపిణీ చేయడం మరింత సంతోషించ తగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ చిట్టిబాబు, ముళ్లపూడి సత్తిబాబు, గుడివాడ మురళీ, గుడివాడ గణేష్, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

రిటైర్డ్ సెట్‌వెల్ సిఇఒ మెహర్‌రాజా


సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు

ఎవిఆర్ విజ్ఞాన్ కేంద్రం కమిటీ ట్రస్ట్ వారు నామినల్ ఫీజుతో నిర్వహిస్తున్న కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌ని ఎక్కువ మంది విద్యార్థులు వినియోగించుకుని, తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని రిటైర్డ్ సిఇఒ ఎండి ఎం.మెహర్‌రాజా అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో 30వ బ్యాచ్‌లో శిక్షణ పొందిన 40 మందికి సర్టిఫికెట్లు ప్రధాన కార్యక్రమం సభ గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి కంప్యూటర్ కోచింగ్ సెంటర్ ప్రిన్సిపల్ కం ఫ్యాకల్టీ ఎంఎస్ఎన్ లక్ష్మి స్వాగతం పలికారు. సభకు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సెక్రవెల్ రిటైర్డ్ సిఇఒ ఎండి ఎం.మెహర్‌రాజా హాజరై మాట్లాడుతూ సర్టిఫికెట్లు తీసుకున్న విద్యార్థులు ఇతరులను ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం మెహర్‌రాజాను విజ్ఞాన కేంద్రం తరపున సత్కరించారు. బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఇరిగేషన్ డిఇ దేవరకొండ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ పంచాయతీ ఇఒ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు విజిఎం విఆర్ కృష్ణారావు, రిటైర్డ్ తహశీల్దార్ భారత్ బచావో జిల్లా అధ్యక్షులు గుబ్బల నాగేశ్వరరావు జయహో సమస్త ప్రతినిధి రవీంద్ర పాల్గొన్నారు.

జగన్ హయాంలో ప్రజాధనం దుర్వినియోగం : ఎంఎల్ఎ

దెందులూరు: కమిషన్ల కోసం కక్కుర్తి పడి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం వల్లే గ్రామాలన్నీ సమస్యల నిలయంగా మారిపోయాయని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చేపట్టిన 'మీకోసం మీ చింతమనేని' కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం ఏలూరు రూరల్ మండలంలోని చాటపర్రు, జాలిపూడి, కాట్లంపూడి, లింగారావు గూడెం గ్రామాల్లోలి స్థానిక టిడిపి జనసేన, బిజెపి నాయకులు, పలు శాఖల అధికారులతో కలిసి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పర్యటించారు. స్థానిక సమస్యలను స్వయంగా పరిశీలించి, సత్వరమే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నేడు పాఠశాలలకు సెలవు : ఐటిడిఎ పిఒ సూర్యతేజ

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఎ పిఒ ఎం.సూర్య తేజ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఏజెన్సీ ఏరియాలోని 5 మండలాల్లో రాగల 48 గంటలు అనగా(2 రోజులు) అల్పపీడనం కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏజెన్సీలోని అన్ని వాగులు, చెరువులు, ప్రాజెక్టు అన్ని నిండి ప్రవహిస్తున్న కారణంగా ఏజెన్సీ గ్రామ ప్రజలు అందరు అప్రమత్తంగా ఉండాలని, ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఎటువంటి కాలువలు, వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని, రాత్రి సమయంలో ప్రయాణాలు చేయకూడదని ఆయన సుచించారు. ప్రజలు సహాయముకు కంట్రోల్ రూమ్ నెం.08821-232221ను సంప్రదించాలని తెలియజేశారు. ఈనెల 19న ఐటిడిఎ పరిధిలోని బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలూరుపాడు మండలాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు పిఒ తెలిపారు.

రైతులు పంట హక్కు పత్రం పొందాలి

గ్రామ రెవెన్యూ కార్యదర్శి సునీత

చాట్రాయి: భూమి లేక వ్యవసాయం మీద మక్కువతో కౌలు భూమి తీసుకొని, సాగు చేసే కౌలు రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా పంటసాగు హక్కు పత్రం తీసుకోవాలని గ్రామ రెవెన్యూ కార్యదర్శి సునీత అన్నారు. మండలంలోని బూరుగుగూడెం గ్రామ సచివాలయంలో బూరుగు గూడెం, పర్వతాపురం గ్రామంలోని కౌలు రైతులకు గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ కార్యదర్శి సునీత మాట్లాడుతూ ఈ క్రాఫ్ చేయాలన్నా, పంట బీమా రావాలన్నా, ఇన్పుట్ సబ్సిడీ రావాలన్నా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా పంట అమ్ముకోవాలన్నా, పంటసాగు హక్కు పత్రం పొంది ఉండాలని, పంట సాగు హక్కు పత్రం (సిసిఆర్‌సి) కౌలు రైతులు భూమి హక్కుపత్రం పొంది ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, బురుగాగూడెం, పర్వతాపురం, టిడిపి నాయకులు గడ్డం మాధవరెడ్డి, తేలూరి శేఖర్, కౌలురైతులు పాల్గొన్నారు.

సిబి కెనాల్‌లో మోటార్లు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన


తొలగించిన పంపు

ముదినేపల్లి: మండలంలోని సిబి కెనాల్ ద్వారా మంచినీటి చెరువులకు సరఫరా అవుతున్న నీటిని ఆక్వా రైతులు దారి మళ్లించి తాగునీటిని చేపలు, రొయ్యల చెరువులకు మళ్లిస్తున్న వైనంపై గురువారం ప్రజాశక్తిలో దర్జాగా నీటి చౌర్యం అనే శీర్షికతో వార్త వెలువడిన విషయం పాఠకులకు విధితమే. ఈ వార్తపై స్పందించిన వడాలి సెక్షన్ జల వనరుల శాఖ అధికారులు వెంటనే జెఇ బి.సిద్దార్థ ఆధ్వర్యంలో లస్కర్లు, సిబ్బంది సిబి కెనాల్‌పై పర్యటించారు. ఈ సందర్భంగా కాలువ గట్లపై ఆయిల్ ఇంజన్లు, కరెంటు మోటార్లు ఏర్పాటు చేసి కాలువ నుంచి నేరుగా తాగునీటిని ఆక్వా చెరువులకు తోడుతున్న కరెంట్ మోటార్లను, ఆయిల్ ఇంజన్లను అక్కడ నుంచి తొలగించారు. మోటర్లు, ఇంజన్ల సామాగ్రిని వాటి నుంచి ఊడదీసి తీసుకుపోయారు. అలాగే ఎత్తేసిన తూముల గేట్లను మూయించారు. కాలువ ద్వారా వస్తున్న తాగునీటిని రైతులు దారి మళ్లించి ఆక్వా చెరువులకు మళ్లించడంతో కలిదిండి మండలంలోని శివారు గ్రామాల మంచినీటి చెరువులకు తాగునీరు అందే పరిస్థితి లేకుండా పోయింది.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపిపి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - మండవల్లి

వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటూ తక్షణమే రోగులకు వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపిటిసిలు మండలంలో నెలకొన్న పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వైద్యులను వెంటాడుతూనే ఉందని, 103 జ్వరంతో వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళితే జ్వరం లేదని పంపించి వేశారని, ప్రయివేటు వైద్యశాలలో వైద్యం తీసుకోవాల్సి వచ్చిందని ఎంపిపి దృష్టికి తీసుకువచ్చారు. వైద్యశాలల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఆయనకు చెప్పారు. గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారని, దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగిందని, దోమలను నిర్మూలించే విధంగా కనీస చర్యలు చేపట్టడం లేదన్నారు. తరుగుమోల ఇండ్లకు వెంటనే పట్టాలు అందించాలని స్థానిక ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాసరావు ఆదేశించినప్పటికీ తహశీల్దార్ పట్టాలను పంపిణీ చేయకపోవడంపై ఎంపిపి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంపిపి వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, దోమల మందును పిచికారీ చేస్తున్నారా అని ప్రశ్నించారు. దీంతో సిహెచ్ఒ పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆయన ఒక్కింత అసహనానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న తరుణంలో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆగస్టు ఆదిష్ఠు, జెడ్‌పిటిసి సభ్యురాలు ముంగర విజయనిర్మల, ఎంపిడిఒ బేబీ శ్రీలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ గోపాల్, ఇఒపిఆర్‌డి ఆనంద్ బాబు, సర్పంచి మండ ఝాన్సీ, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మాంసం దుకాణదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

నూజివీడు టౌన్: మాంసం దుకాణదారులు మాంసంపై ఈగలు, దోమలు వాలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శానిటరీ ఇన్స్‌పెక్టర్ నాగరాజు అన్నారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు నూజివీడు పట్టణంలోని మాంసం దుకాణదారులకు ఈ వర్షాల నిమిత్తం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్‌పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ మాంసానికి కవర్లు తప్పనిసరిగా కప్పి విక్రయించాలన్నారు. జాగ్రత్తలు పాటించకుండా మాంసం విక్రయించినచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రారంభం

ఏలూరు సిటీ: ఏలూరులో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉభయగోదావరి జిల్లాల అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు క్రియాశీలక సభ్యత్వ వాలంటీర్లకు పిలుపునిచ్చారు. జనసేన సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఏలూరు నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్ వ్యవహరించారు. అనంతరం క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని రెడ్డి అప్పలనాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 18 నుంచి 28 వరకు క్రియాశీలక సభ్యత్వం నమోదు కొనసాగుతుందని వెల్లడించారు. ఏలూరులోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, వాలంటీర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు ఇదో సువర్ణ అవకాశంగా మలుచుకోవాలని ఆయన సూచించారు. క్రియాశీలక కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, అంగవైకల్యం బారిన పడితే రూ.50 వేలు పార్టీ అందజేస్తుందని తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇందుకోసం నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు. సభ్యత్వం నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ క్రియాశీలకంగా వ్యవహరించడం ద్వారా ఏలూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ఏలూరులో క్రియాశీలక సభ్యత్వం నమోదు చేయించే 57 మంది వాలంటీర్లతో కూడిన ఒక జాబితాను ఆయన విడుదల చేశారు. ఏలూరు నియోజకవర్గంలో ఎవరైనా నమోదు చేయించుకోవాలనుకునే వారు ఈ వాలంటీర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల కన్వీనర్ రాఘవయ్య చౌదరి, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, సీనియర్ నాయకులు నారా శేషు, జిల్లా ఉపాధ్యక్షులు ఇళ్లా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణి బాబు ప్రారంభించారు. మూడు సంవత్సరాలుగా దిగ్విజయంగా క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జనసేన అధినేత డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.